





ఉచిత విద్యుత్ జీవో విడుదలపై చేనేత, మరమగ్గ కార్మికుల అభినందనలందుకుంటున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

## ఏఎంసీ చైర్‌పర్సన్ల నియామకం



రాజమ్మ

నగరి/విజయపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా విజయపురం మండలం మహారాజపురానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజక వర్గ తెలుగు రైతు విభాగం కన్వీనర్ డి.సుబ్రహ్మణ్యంరాజు సతీమణి రాజమ్మను శుక్రవారం నియమించారు. వీరి కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయులుగా ఉన్నారు. అప్పట్లో గాలి ముద్దుకృష్ణమ నాయుడికి సన్నిహితంగా ఉండేవారు. తమను గుర్తించిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చిన్నబాబుకు సుబ్రహ్మణ్యంరాజు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రాజమ్మను మండల టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, దశరథరాజు, కొండూరు ధాము, వెంకటేసులుయాదవ్, బీజేపీ నాయకులు రాజశేఖర్ రాజు తదితరులు అభినందించారు.

శ్రీరంగరాజపురం/వెదురుకుప్పం: ఎస్‌ఆర్‌పురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్‌గా గంగాధర నెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య సతీమణి జి.జయంతిని నియమించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు, తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ జయంతి కృతజ్ఞతలు తెలిపారు.



జయంతి

## మాటిస్తే నెరవేర్చే వరకు మరువను

ఎమ్మెల్యే భానుప్రకాష్........4లో

### రేపు, ఎల్లుండి విధుల్లోనే ఖజానా సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికసంవత్సరాంతంలో భాగంగా సెలవు రోజులైన ఆది,సోమవారాల్లో కూడా జిల్లా పరిధిలోని ఆరు సబ్ ట్రెజరీ కార్యాలయాలు పనిచేస్తాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వం బడ్జెట్, నాన్-బడ్జెట్ ద్వారా వివిధ శాఖలకు వివిధ పద్దుల కింద నిధుల నిల్వలను బట్టి 30, 31 తేదీల్లో చివరి క్షణాల్లో విడుదల చేసే అవకాశం ఉందన్నారు. వాటిని ఎప్పటికప్పుడు ఖజానాశాఖ అధికారులు పరిశీలించి పాస్ చేయాల్సివుంటుందని పేర్కొన్నారు. సెలవురోజులైనా ఆ రెండు రోజులు ప్రభుత్వ ట్రాన్సాక్షన్ జరిపే బ్యాంకు బ్రాంచ్‌లు పనిచేస్తాయన్నారు. నిధులు మురిగిపోకుండా వాటిని అధికారులు పాస్‌చేసి సీఎఫ్ఎంఎస్ ద్వారా పంపాల్సివుంటుంది కాబట్టి ఖజానా అధికారులు, సిబ్బంది ఆ రోజుల్లో విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.

### లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని 40మందికి ఆగిన పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లైఫ్ సర్టిఫికెట్లు నిర్దేశించిన గడువులోగా అందజేయని 40 మంది ప్రభుత్వ పెన్షనర్లకు ఏప్రిల్ ఒకటో తేదీన చెల్లించాల్సిన మార్చినెల పెన్షన్ నిలుపుదల చేసినట్లు జిల్లా ఖజానా, లెక్కల శాఖ డీడీ రామచంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఆరు సబ్ ట్రెజరీల పరిధిలో 12,380 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెన్షనర్లు ఉన్నారన్నారు. వీరంతా జీవించి ఉన్నట్లు జీవన్ ప్రమాణ్ పత్రా(లైఫ్ సర్టిఫికెట్)లను 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు సమీప ఎస్టీవో కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లోని జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా అందించాల్సి ఉందన్నారు. గడువులోగా 12,340 మంది సర్టిఫికెట్లు సమర్పించారని చెప్పారు. మిగిలిన 40 మంది పెన్షన్ నిలుపుదల చేసినట్లు వెల్లడించారు.

## కార్పొరేషన్‌లో అవినీతి తిమింగలం

- మామూళ్లు ఇవ్వకుంటే ముందుకు కదలని ఫైళ్లు

చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

చిత్తూరు నగర పరిధిలోని 8వ డివిజన్‌లో ఓ మహిళ గత ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పనిచేసింది. ఆమె పేదరికంలో ఉండడం గమనించిన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఎంపీ ల్యాడ్స్ నిధులతో శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.14 లక్షలతో కాంట్రాక్టు ఇప్పించారు. ఆమె ఆ పనుల్ని వేరే కాంట్రాక్టరు పేరుతో ప్రారంభించింది. ఈ పనులు ప్రారంభించక ముందే ఇంజనీరింగ్ శాఖలోని ఓ ఉన్నతాధికారి తనకు ఇవ్వాల్సిన పర్సంటేజీ ఇచ్చి పనులు చేసుకోవాలని హుకుం జారీ చేశారు. ఆమె తన ఆర్థిక పరిస్థితులను చెప్పినా కనికరించలేదు. చివరకు ఆమె చేసేదేమీలేక తన కమ్మలు, ముక్కుపుడక కుదువ పెట్టి లంచం ముట్టజెప్పింది.ఆ తరువాతనే పనులు చేయడానికి ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.



నిబంధనలకు విరుద్ధంగా 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టి ఆగిపోయిన రోడ్డు పనులు

చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ శాఖలో జరిగే ప్రతి అభివృద్ధి పనికీ ఓ అధికారికి పర్సంటేజీలు ఇవ్వాల్సిందేనన్న ప్రచారం జరుగుతోంది. లంచం ఇవ్వని కాంట్రాక్టర్ల ఫైళ్లకు అడుగడుగునా కొర్రీలు వేస్తుంటారని ఆయనకు పేరుంది. నిబంధనల ప్రకారం 15వ ఆర్థిక సంఘం నిధులను ఆమోదం పొందిన పనులకు మాత్రమే వాడాల్సి ఉంది.అయితే ఆయన కమీషన్ల కోసం ఆ నిధులను కూడా పక్కదారి పట్టిస్తున్నారు. ఉదాహరణకు విజ్ఞాన దీప్తి పాఠశాలకు ఎదురుగా రూ.19 లక్షలతో డ్రైనేజీ పనులు చేసేందుకు ఆమోదం వుండగా రూ.5 లక్షలకు మాత్రమే డ్రైనేజీ పనులు చేసి మిగిలిన రూ.14 లక్షలను రోడ్డు పనులకు బదలాయించారు. ఆ పనులను కూడా తనకు అనుకూలుడైన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో ఉన్నతాధికారులు మందలించారు. అయితే అప్పటికే రోడ్డు పనుల కోసం మట్టిని తవ్వించి వదిలేశారు.

### పనుల ప్రారంభానికి ముందే కమీషన్ వసూలు

ప్రస్తుతం చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో రూ.18 కోట్ల విలువ చేసే పలు రకాల 200 అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.ఈ పనులన్నీ ఆయన పర్యవేక్షణలోనే జరగాల్సి రావడం వరంగా మారింది. టెండరు ద్వారా పనులు తీసుకున్న కాంట్రాక్టర్ ప్రారంభానికి ముందే సగం కమీషన్ ఇచ్చేయాలి. మొదటి బిల్లులు పెట్టినప్పుడే మిగిలిన మొత్తాన్ని ఇచ్చేయాలి.లేదంటే నాణ్యత పేరుతో బిల్లుల మంజూరుకు కాలయాపన చేస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పైగా అకారణంగా వేధిస్తుంటారని, ఆయన బూతులపురాణంతో ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు కూడా వాపోతున్నారు.

### ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు క్రీడలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు www.joinindianarmy.nic.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు ఇదే వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

### వీవీఐపీల పర్యటనలో వినతుల పరిష్కారానికి రూ.10 కోట్లు మంజూరు

కుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో వీవీఐపీల పర్యటనలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.10 కోట్లను విడుదల చేసింది. కడా పీడీ అభ్యర్థన మేరకు ఈ నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాలు, వసతి గృహాల మరమ్మతులు, చిన్న ఆలయాల పునరుద్ధరణ పనులు, తాగునీటి బోర్లు వంటి సమస్యల పరిష్కారానికి ఈ నిధులను కేటాయించారు. కడా పీడీ వికాస్ మర్మత్ అభ్యర్థన మేరకు నిధులను మంజూరు చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్: 6:30 (శనివారం సాయంత్రం)

సహర్: 4:51 (ఆదివారం ఉదయం)

## ఉద్యోగ, ఉపాధ్యాయుల కళ్ళలో ఆనందం

- రెండేళ్ళ నాటి పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లకు మోక్షం
- సీపీఎస్ ఉద్యోగులకు మ్యాచింగ్ గ్రాంట్ చెల్లింపు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వారికి తెలియకుండా లాగేసుకోవడంతో అప్పట్లో ఉద్యోగ, ఉపాధ్యాయవర్గం తీవ్ర ఆందోళనకు గురైంది. ఏపీజీఎల్ఐ బాండ్ల కాలపరిమితి ముగిసినా... ఆ చెల్లింపులు చేయలేదు. పిల్లల చదువులు, వివాహాలు, గృహనిర్మాణాలు, ఇతర అత్యవసరాలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు లోన్లు పెట్టుకున్నా... ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసింది. నాటి పెండింగ్ రుణాల మొత్తాన్ని ప్రస్తుత ప్రభుత్వం రెండ్రోజుల క్రితం చెల్లించి ఉద్యోగ, ఉపాధ్యాయుల కళ్ళలో ఆనందం నింపింది. చిత్తూరుజిల్లాలో దాదాపు రెండు వేల మందికి ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ బాండ్ల తుది చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాలకు జమయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. అదేవిధంగా పీఎఫ్ రుణాలను గత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో చాలామంది తమ చందా వాటాను తగ్గించుకున్నారు. ఉద్యోగ విరమణ చేసేవారికి తుది చెల్లింపులు చేయలేదు. అవన్నీ కలిపి ఎట్టకేలకు ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసింది. పీఎఫ్ రుణాలు సగటున ఒక్కొక్కరికీ రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు క్రెడిట్ అయ్యాయి.

**సీపీఎస్ ఉద్యోగులకు ....**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంట్‌ను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. గతనెల వరకు ఉన్న మొత్తాన్ని ప్రాన్ ఖాతాలకు సీపీఎస్ ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించి వాటాతో పాటు ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటును కలిపి జమచేయాల్సివుండగా, గత ఐదేళ్లలో ఎప్పుడూ సక్రమంగా చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం 12 నెలల బకాయిల మొత్తాన్ని చెల్లించింది. దీంతో సీపీఎస్ ఉద్యోగసంఘాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాయి.

## కూటమి ప్రభుత్వ ఏర్పాటులో బీసీల పాత్ర కీలకం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటులో బీసీల పాత్ర కీలకమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో రూ.53 లక్షలతో నిర్మించిన అదనపు గదులను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు గంగినేని చెరువు పార్కు వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం బీసీలను బ్యాక్‌వర్డ్ క్యాస్ట్‌గా కాకుండా.. బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా భావించి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీసీల సమావేశాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తరగతులు, సామాజిక కార్యక్రమాలను బీసీ భవన్‌లో నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమాన హక్కులను కల్పించారన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు ఏఎస్ మనోహర్, చల్లా బాబు, ఆర్.గాంధీ, చంద్రప్రకాష్, షణ్ముగం, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తదితరులు

## ప్రజాసేవకే మా కుటుంబం అంకితం!

**నారా భువనేశ్వరి**



ఇఫ్తార్ విందులో భువనేశ్వరి

కుప్పం/శాంతిపురం/రామకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవకు తమ కుటుంబం అంకితమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చెప్పారు.చంద్రబాబును అక్రమ కేసులో జైల్లో ఉంచినప్పుడు నిజం గెలవాలంటూ తాను చేపట్టిన యాత్రకు లభించిన మద్దతు ఎనలేనిదన్నారు.తెలుగుదేశం కార్యకర్తలు, మహిళలు కష్టకాలంలో తనకు ఇచ్చిన మద్దతు మరువలేనిదని, ప్రజలకు తమ కుటుంబం రుణపడి ఉంటుందని చెప్పారు.అలాగే తమ కుటుంబాన్ని నాలుగు దశాబ్దాలుగా ఆదరిస్తున్న కుప్పం ప్రజల రుణం తీర్చుకునేలా ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వ పరంగా, ఎన్టీయార్ ట్రస్టు పరంగా అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా భువనేశ్వరి మూడవ రోజైన శుక్రవారం శాంతిపురం మండలం నక్కనపల్లె, రామకుప్పం మండలం కొంగనపల్లె, రాజుపేట గ్రామాల్లో పర్యటించారు. మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థుల అవహేళనలు, అవమానాలు, అవరోధాలను అధిగమిస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు రాజకీయ పయనం సాగుతోందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేస్తున్న చంద్రబాబు అడుగు జాడల్లో తాను నడుస్తున్నానన్నారు.ఆయన అమలు చేసిన, చేస్తున్న పథకాల గురించి మీటింగుల్లో తాను చెప్పడానికి ముందే ఎందరో మహిళలు ముందుకు వచ్చి వాటి గురించి వివరిస్తుంటే అబ్బురమనిపిస్తోందన్నారు.



పట్టుగూళ్ల మాలతో నక్కనపల్లె మహిళల సత్కారం



నక్కనపల్లెలో మల్బరీ తోటను పరిశీలించి పట్టు రైతులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

### పట్టు రైతులతో మమేకమై

శాంతిపురం మండలం నక్కనపల్లెలో నారా భువనేశ్వరి పట్టు రైతులతో మమేకమయ్యారు. కడపల్లె సమీపంలో సొంత ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం శాంతిపురం మండలం నక్కనపల్లెకు ఆమె చేరుకున్నారు. ఇక్కడ చిన్నక్క అనే మహిళకు చెందిన మల్బరీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నక్క, ఆమె కొడుకు దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పట్టు రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిలో పట్టుగూళ్లకు రూ.50 వంతున ప్రభుత్వం చెల్లించే ప్రోత్సాహకం లేకుండా పోయిందన్నారు. ఈ ప్రోత్సాహకాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. అలాగే చాగీ సెంటర్లు ఇక్కడే ఏర్పాటు చేస్తే పట్టురైతులకు అనుకూలంగా ఉంటుందన్నారు. అక్కడినుంచి భువనేశ్వరి నక్కనపల్లె గ్రామంలోని పట్టుగూళ్ల షెడ్డుకు వచ్చి పరిశీలించారు. ఇక్కడ శంకర్‌రెడ్డి అనే రైతు మాట్లాడుతూ కర్ణాటక చాగీ సెంటర్లనుంచి పంట తెచ్చుకోవాల్సి వస్తోందని, ఇక్కడి పంటను తిరిగి కర్ణాటకు ఎగుమతి చేయడం వల్ల ఆదాయం వారికి వెళ్తోందని చెప్పారు. ఈ విషయంలో కర్ణాటక ప్రాబల్యాన్ని తగ్గించాలని విన్నవించారు. ఈ సందర్భంగా స్పందించిన భువనేశ్వరి మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్రా అనే తేడాలు ఇక్కడ వద్దన్నారు. అందరూ భారతీయులేనని, కలసిన ఎదగాలని హితవు పలికారు. తమకేం కావాలో చెప్పి చేయించుకోవాలని, అంతేకానీ కర్ణాటక రైతుల మీద, వ్యాపారుల మీద అసూయ పెట్టుకోరాదని బుద్ధిమాటలు పలికారు.శుక్రవారం రాత్రి కుప్పంలో ముస్లిం మహిళల ఇఫ్తార్ విందులో భువనేశ్వరి పాల్గొన్నారు. పాతపేట వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీడీ బోర్డు సభ్యుడు శాంతారాం,మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ నేతలు బీఆర్.సురేశ్‌బాబు, మనోహర్,మునస్వామి,పత్ర నారాయణాచారి,చంద్రశేఖర్, విశ్వనాథ నాయుడు, ఆనంద రెడ్డి, బాబునాయుడు, రాజ్‌కుమార్,వెంకట్రామగౌడు,ఆంజనేయరెడ్డి,చిన్నికృష్ణ, ఉదయకుమార్, చలపతి, సీతాపతి,రామ్మూర్తి, గంట్లప్పగౌడు, మహ్మద్‌రఫీ. కృష్ణానాయక్, మనోహర్, జయశంకర్, వెంకటాచలం, నందారెడ్డి, గజేంద్ర, కామరాజనాయక్, భూపతి, రామకృష్ణప్ప, సలాంసాబ్, ఆదిల్, బాలరాజు, వెంకటరమణ, సుబ్రీ, అవినాష్, మంజునాథ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమలలో 'రాబిన్‌హుడ్'

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): 'రాబిన్‌హుడ్' సినిమా హీరో నితిన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన సినిమా విడుదల సందర్భంగా శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సినిమాను అందరూ చూసి ఎంజాయ్ చేయాలని కోరారు. తన తర్వాత చిత్రం 'తమ్ముడు' మే లేదా జూన్ నెలలో విడుదల కానుందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి వచ్చిన నితిన్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించగా, వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయం ముందు నితిన్‌ను చూసేందుకు, సెల్ఫీల కోసం పలువురు ఉత్సాహం చూపారు.










### శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్డీవో మాజీ చైర్మన్, ఏపీ శాస్త్ర సాంకేతిక సలహాదారు సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎన్‌ఎస్జీ డీజీ బ్రిగు శ్రీనివాసన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


### శ్రీవారి సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.36 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,279

తలనీలాలు సమర్పించినవారు: 24,482





# నామినేటెడ్ ఆశలు

- జాబితాలతో సిద్ధమైన టీడీపీ, జనసేన
- కరువైన ఏకాభిప్రాయం
- నేడు విజయవాడకు తుది జాబితా?

తిరుపతి- ఆంధ్రజ్యోతి

మూడో విడత నామినేటెడ్ పదవుల జాబితాపై తిరుపతిలోని కూటమి పార్టీల నాయకులు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. జాబితా కసరత్తులో స్థానిక నాయకత్వం మల్లగుల్లాలు పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవులను ఉగాదికి అటు, ఇటుగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. తుడా ఛైర్మన్ పీఠంపై అధిష్ఠానందే తుది నిర్ణయం కాబట్టి ఆశావహులు మౌనందాల్చారు. తక్కిన ఆలయాల పాలక మండళ్లు, టీటీడీ ధార్మిక సలహా మండళ్లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి నామినేటెడ్ పదవుల జాబితాపై కసరత్తు తుది దశకు చేరుకుంది. నగరంలో ప్రధానంగా దేవదాయశాఖకు చెందిన ప్రసిద్ధ ఆలయం తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం ఛైర్మన్‌కు పోటీనెలకొంది. తాళ్లపాక పెదగంగమ్మ, వేశాలమ్మ, అంకాళమ్మ, రామాలయం పాలకమండళ్ల జాబితా దాదాపుగా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ, జనసేన నుంచి పోటాపోటీగా పదవులు ఆశిస్తున్నట్లు కనిపిస్తోంది.

### ఎవరి జాబితాలు వారివి

స్థానికాలయాల పాలకమండళ్ల కోసం జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన అనుచర వర్గానికి నామినేటెడ్ పదవులను కేటాయించేందుకు ఆసక్తి చూపుతూ జాబితా సిద్ధం చేశారన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ తన అనుచరవర్గంతో జాబితా సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఉదాహరణకు గంగమ్మ ఆలయ పాలకమండలిలో 11 మంది సభ్యులుంటే టీడీపీ, జనసేనకు ఐదుగురు చొప్పున, బీజేపీకి ఒకరిని కేటాయించాలని మెజారిటీ నాయకుల అభిప్రాయంగా కనిపిస్తోంది. అయితే టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు మాత్రం తమకంటే తమకు ఎక్కువ సభ్యులు కావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. వాటా సంగతి అటుంచితే ఎవరికివారు జాబితాను తయారు చేసి పంపేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. గంగమ్మ ఆలయ ఛైర్మన్ విషయంలో ఇరు నేతల మధ్య బేధాభిప్రాయాలు రావడం వల్లే రెండు జాబితాలకు తెరలేచినట్టు సమాచారం. రెండు రోజుల క్రితం సుగుణమ్మ నివాసంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో టీడీపీ కార్యాలయం నుంచే తుది జాబితా పంపాలని ఆపార్టీ నేతలు కొందరు ఒత్తిడి తీసుకొచ్చారు. సిద్ధంచేసిన జాబితాలను ఎవరికి వారు విజయవాడకు పంపేపనిలో ఉన్నట్టు తెలిసింది.

### ఏకాభిప్రాయంతోనే అందరికీ న్యాయం

ఇక టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, ఎస్వీబీసీ కమిటీలోను సీనియర్లకు చోటుకల్పించేందుకు ఎమ్మెల్యే పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ నేతతో పాటు మాజీ పోలీస్ అధికారి పేరు వినిపిస్తోంది. ఎన్నికల ముందు పార్టీ విజయానికి కృషిచేసిన సీనియర్లను గుర్తింపు ఇస్తే కేడర్‌లో నమ్మకం కుదురుతుందన్న ఆలోచనతో జనసేన నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. సీనియర్లకు తొలి రెండేళ్లు అవకాశం ఇచ్చి తర్వాత రెండేళ్లు యువతకు చోటుకల్పించాలన్న యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అభిప్రాయ బేధాలు లేకుండా నిర్ణయం తీసుకుంటే విజయం కోసం పనిచేసిన వారికి న్యాయం దక్కుతుందని కూటమి వర్గాలు పేర్కొంటున్నాయి.



## శ్రీసిటీలో నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

శ్రీసిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పురస్కారాలను అందజేయనున్నారు. వారిలో ప్రముఖ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి, పురావస్తు పరిశోధకుడు, స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, సినీ చరిత్రకారుడు ఎస్వీ రామారావు, సంగీత విదుషీమణి రాణీ నాగశ్రీ శైలేశ్వరి, చమత్కారోపన్యాసకుడు ప్రాస మణి ఉన్నారు. వీరికి స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పురస్కారాలను అందజేయనున్నారు.



**డాక్టర్ నరాల రామారెడ్డి:** కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన అవధాన కవి.



**ఈమని శివనాగిరెడ్డి:** తెనాలికి చెందిన ఈయన ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడి తెలంగాణ ప్రభుత్వ చారిత్రక దేవాలయాలకు పరిశోధకుడిగా, సలహాదారుగా ఉన్నారు. చారిత్రక, దేవాలయాలపై సుమారు 500 పుస్తకాలు రచించారు.



**ఎస్వీ రామారావు:** ఈయన సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ 1998లో పదవీవిరమణ పొందారు. తన 13వ ఏట నుంచి నాటకాలపై మక్కువతో ఎన్నో ప్రదర్శనలు చేశారు. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమకు చారిత్రక పరిశోధకుడు. నంది అవార్డులు కూడా వరించాయి.



**రాణి నాగశ్రీ శేలైశ్వరి:** సంగీతంపై ఆమెకు మక్కువ ఎక్కువ. ఆ మక్కువతో సంగీత రంగంలో సంగీత విదూషీమణిగా తిరుపతి మహిళా యూనివర్శిటీలో సంగీతశాఖకు విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



**ప్రాస మణి:** ఈయన చమత్కారోపన్యాసకుడు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఈయన అసలు పేరు అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు. కామర్స్‌లో పాఠాన్ని ప్రాసగా చెప్పడంలో దిట్ట. ఏపీలోనే తెలుగుభాష, సంస్కృతి, హైందవ తెలుగు సంస్కృతుల మీద ప్రావీణ్యం, పట్టున్న వ్యక్తి.

## హత్యాయత్నం కేసులో ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్ట్

సత్యవేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వాహనంతో ఢీకొట్టి హత్యకు ప్రయత్నించిన సత్యవేడు మండలం కన్నవరానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సీఐ మురళి తెలిపిన ప్రకారం.. సత్యవేడులోని ఉలవచేనుకు చెందిన పవన్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల పరీక్షలు రాశాడు. ఇతడు కన్నవరం హరిజనవాడకు చెందిన యువతి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆమెను కలిసేందుకు పవన్ తరచూ కన్నవరం వచ్చేవాడు. ఆ యువతి తల్లితో సన్నిహితంగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ వీరి ప్రేమ వ్యవహారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పవన్‌ను పలుమార్లు హెచ్చరించాడు. ఈ క్రమంలో భాస్కర్‌కు బుద్ధి చెప్పాలంటూ ఆ యువతి పవన్‌ను కోరింది. దీంతో ఈనెల 24వ తేది మధ్యాహ్నం పవన్ తన స్నేహితులైన సత్యవేడుకు చెందిన భరత్, నాగలాపురం మండలం బీరకుప్పానికి చెందిన సారథి, ఉదయ్‌ను వెంటబెట్టుకుని కన్నవరానికి చేరుకుని భాస్కర్‌తో గొడవపడ్డాడు. స్థానికులు సర్ది చెప్పి పంపేశారు. దీన్ని అవమానంగా భావించిన భాస్కర్.. పవన్‌ను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు సాయంత్రం తన లగేజీ వాహనంలో సత్యవేడు నుంచి కన్నవరానికి వస్తుండగా.. మార్గమధ్యంలో ఏఎంపురం వద్ద పవన్ తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తుండడం గమనించి వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో సారథి, ఉదయ్, పవన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సారథి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. పవన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి భాస్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ వద్ద భాస్కర్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బాధితుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. చట్టప్రకారం న్యాయం చేస్తామని సీఐ మురళి హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

## 'ఎర్ర'స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి అలియాస్ శివమణి గోవిందన్ శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నాడు. ఇతనిపై చాలా కేసులు ఉండడంతో పీడీ యాక్టు నమోదుకు టాస్క్‌ఫోర్స్ అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం



ఊరేగింపులో గణాచారి, ఈవో నవీన్‌కుమార్ తదితరులు

- ఘనంగా పోలేరమ్మ వెళ్లనంపు గ్రామోత్సవం
- ముగిసిన ముత్యాలమ్మ జాతర

# అక్కా.. పోయి వస్తానే..!

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'అక్కా.. పోయి వస్తానే. మళ్లీ వచ్చే ఏడాది వస్తానే..' అంటూ పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మకు చెప్పి నిమజ్జనానికి బయలుదేరగా, భక్తులు చీరలు పరిచి సాగిలి పడి సాగనంపారు. ముత్యాలమ్మ జాతరలో ఆఖరి ఘట్టమైన 'పోలేరమ్మ వెళ్లనంపు' కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో నాలుగురోజులు పాటు వైభవంగా జరిగిన జాతర శుక్రవారంతో ముగిసింది. గంగమిట్ట మీద కొలువుతీరిన పోలేరమ్మకు వేకువజామున కుంభం పోసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పోలేరమ్మ జాతర ముగుస్తున్నట్లు గణాచారి ప్రకటించారు. ఆ తర్వాత పోలేరమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమం ప్రారంభంకాగానే బాణసంచా పేల్చగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీధులలో మహిళలు చీరలు పరిచి అమ్మవారిని చీరలపై సాగనంపారు. కోరుకున్న కోర్కెలు తీర్చాలంటూ మహిళలు పూజలు చేశారు. పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించాక పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మను అక్కా వెళ్లివస్తానంటూ పలకరించే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. ముత్యాలమ్మ ఆలయంలో పోలేరమ్మ విగ్రహాన్ని ఉంచి గణాచారి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఊరి చివర మైదానంలోకి పోలేరమ్మ విగ్రహాన్ని తీసుకెళ్లి అక్కడ పంబలోళ్లు డప్పు వాయిస్తుండగా.. ఆసాదులు పోలేరమ్మ కథను భక్తులకు వినిపించారు. ఆమెకు ఇష్టమైన బూతు పురాణాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మహిళలకు అమ్మవారి పూనకం వచ్చి, చిందులు వేస్తూ వచ్చే ఏడాది వస్తానంటూ చెబుతారు. ఆ మహిళలపై గణాచారి పసుపునీళ్లు చల్లి దీవెనలు అందించడంతో జాతర ముగిసింది. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు నిర్వహించారు. ఇక, జాతర ముగియడంతో భక్తులు ఒక్కసారిగా వెనుదిరగడంతో రద్దీ నెలకొంది. తూర్పుకనుపూరులో తిరుగు ప్రయాణమయ్యే జనంతో పోటెత్తిపోయింది. వాహనాలు వరుసక్రమంలో బారులు తీరడంతో పలు చోట్ల రాకపోకలు ఆగాయి. కాగా, ముత్యాలమ్మ జాతర సందర్భంగా హుండీ శుక్రవారం హుండీ లెక్కించగా మొత్తం రూ.64,46,838 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అదే గతేడాది రూ.53,60,973 వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.11,14,135 పెరిగింది.



జాతర నుంచి తిరిగి గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచివున్న భక్తులు

## మాటిస్తే నెరవేర్చే వరకు మరువను

- ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):ఎవరికైనా సరే మాటిస్తే నెరవేర్చే వరకు మరిచేదిలేదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు.మరమగ్గ, చేనేత కార్మికుల చిరకాల వాంఛ అయిన ఉచితవిద్యుత్ జీవో విడుదల చేసిన సందర్భంగా నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి కృతజ్ఞతా సభ ఏర్పాటు చేశారు.వేలాదిమంది చేనేత, మరమగ్గ కార్మికులు హాజరైన ఈ సభకు ఎమ్మెల్యే భానుప్రకాష్ రాగానే గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆయన సభలో మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 నెలల్లో 60 కోట్ల రూపాయలతో సిమెంటురోడ్లు వేయడం జరిగిందన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నేతన్నలకు,మరమగ్గ కార్మికులకు నెలకు 500 యూనిట్లు, చేనేత కుటుంబాల వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుకు జీవోను సైతం విడుదల చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు ,మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు.గతంలో ఏ ప్రభుత్వం కూడా తీసుకోని ఈ మంచి నిర్ణయాన్ని తీసుకుని నేతన్నలకు పూర్వ వైభవం వచ్చేలా చంద్రబాబు కృషి చేశారన్నారు.2012లో తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు 50శాతం విద్యుత్ సబ్సిడీని నేతన్నలకు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు.అలాగే నగరి మున్సిపాలిటీ అయ్యాక ఇంటి పన్ను ఎక్కువైందంటే ఆయనే తగ్గించేందుకు కృషి చేశారన్నారు.వైసీపీ అధికారంలో వున్నపుడు పెంచిన కరెంటు చార్జీలను భరించలేక మరమగ్గ కార్మికులు తమ వృత్తిని వదిలి పక్క రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు.ఏకాంబరకుప్పం రైల్వేగేట్ అండర్‌బ్రిడ్జి ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు.స్థానిక టీడీపీ నాయకులతో పాటు టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



మరమగ్గ కార్మికుల కృతజ్ఞతా సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



## హత్యాయత్నం కేసులో ఆడిటింగ్ అధికారి అరెస్టు

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న కేసులో ప్రభుత్వ ఆడిట్ ఆఫీసర్ మధుకిరణ్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్ద అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మధుకిరణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆడిటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈనెల 17న కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో మధుకిరణ్‌రెడ్డిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి మధుకిరణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి కడప మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

# రైతుల చేతిలో డిజిటల్ శక్తి..!

**పైలెట్ ప్రాజెక్టు కింద 500మంది రైతులకు శిక్షణ పూర్తి ● వచ్చే నెల మొదటి వారంలో రెండో దశ శిక్షణ ప్రారంభం**

చిత్తూరు సెంట్రల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయంపైనే ఆధారప డిన రైతులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడంతో పాటు స్మార్ట్ ఫోన్ల ద్వారా వ్యవసాయ సంబంధిత అంశాలపై పరి జ్ఞానాన్ని పెంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తాము పండించిన పంటకు ఎప్పటికప్పుడు మార్కెట్ ధరల వివరాలు తెలుసుకుని లాభ సాటి ధరలకు విక్రయించుకునేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో తోడ్పడనుంది. విత్తనం నుంచి విక్రయం దాకా, వాతావరణం నుంచి మార్కెట్ ధరల దాకా తెలుసుకునే వీలు ఇప్పుడు స్మార్ట్ ఫోన్ ద్వారా సాధ్యమవు తోంది.వివిధ రకాల యాప్‌ల వినియోగంతో తమ వ్యవసాయ ఉత్పత్తులను దళారులపై ఆధార పడకుండా నేరుగా రైతులు అమ్ముకునే పరిజ్ఞానాన్ని అందిస్తోంది.



స్మార్ట్‌ఫోన్లు చూపుతున్న రైతులు

**● స్కిల్ ఆఫ్ చిత్తూరు**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన పెంపొందించడం ద్వారా సత్ఫలి తాలు సాధించవచ్చనే సంకల్పంతో జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా శిక్షణ కల్పించే దిశగా స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమం మొదలైంది. రాష్ట్రంలోనే తొలిసా రిగా చిత్తూరు జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అమలు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా వ్యవసాయ సంబంధిత అంశాలపై పరి జ్ఞానాన్ని పెంచే ఈ కార్యక్రమాన్ని స్కిల్ ఆఫ్ చిత్తూరు-డిజిటల్ ట్రైనింగ్ పేరుతో కలెక్టర్ సుమిత్ కుమార్ శ్రీకారం చుట్టారు.రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యాన్ని అందించడం, తద్వారా రైతులే స్వయంగా వ్యవసాయ సాంకే తిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే సామ ర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం. స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ కార్యక్ర మాన్ని నిర్వహించేందుకు మొదట 8మంది మాస్టర్ ట్రైనర్లకు ఈ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వగా, తొలి దశలో 502 రైతు సేవా కేంద్రాల ద్వారా పక్షం రోజుల పాటు 500 మంది రైతు లకు శిక్షణ ఇచ్చారు. ఏప్రిల్ నెల మొదటి వారంలో రెండో దశ శిక్షణ ప్రారంభం కానుంది.

**●స్మార్ట్‌ఫోన్‌పై శిక్షణతో**

యూపీఐ యాప్ ద్వారా డబ్బులు పంపడం, అందుకోవడం, మార్కెట్ ధరలు తెలుసుకోవడం, వాతావరణం, పంట సమా చారం యాప్, యూట్యూబ్ ద్వారా వ్యవసాయ సంబంధిత విషయాలు తెలుసుకోవడం, ప్రభుత్వ విధానాలు, కల్పించే ప్రయోజనాలు తెలుసుకోవచ్చు.. డిజిటల్ వ్యవసాయ యాప్‌ల వివరాలు.. అగ్రి సెంటర్, వ్యవసాయం, ప్లాంటిక్స్, నేషనల్ పెస్ట్ సర్వైవ్ లెన్స్ సిస్టం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకునే వెసులు బాటు వుంది.వ్యవసాయ ఉపకరణాలు, ఆధు నిక వ్యవసాయ సాంకేతిక యంత్రాలు, స్మార్ట్ ఫార్మింగ్, టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, నూతన వంగడాలు, నూత సాగు పద్ధతుల గురించి క్షుణ్ణంగా తెలుసుకునే వీలుంటుంది.

● జిల్లాలో మొత్తం 3,26,788 ఎకరాలు సాగులో ఉండగా, అందులో 1,69,560 ఎక రాలు ఆహార పంటలు పండిస్తున్నారు. ఉద్యానవన పంటల సాగు 1,45,335 ఎకరాల్లో, పట్టు పరిశ్రమ సాగు 11,892 ఎకరాల్లో జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,57,575 మంది రైతులు, 502 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రస్తుతం సేవలు పొందుతున్నారు.



డిజిటల్ రంగంలో శిక్షణ పొందిన రైతులు

**● శిక్షకులకు ప్రైజ్‌మనీ**

ఎక్కువమంది రైతులకు శిక్షణ ఇచ్చిన రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులకు మొదటి బహుమతి కింద రూ.20 వేలు, రెండవ బహుమతి కింద రూ.12, మూడో బహుమతి కింద రూ.8 వేలు ఇవ్వనున్నారు.

# దివ్యాంగులకు ప్రభుత్వ చేయూత : మంత్రి

చిత్తూరు సెంట్రల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూత ఇస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే భవన్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి సమగ్రశిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లోని 301 మంది దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల ప్రతిభను మంత్రి ప్రశంసించారు. జీడీ నెల్లూరుకు చెందిన ఐదేళ్ల చిన్నారి విష్ణు ప్రజాప్రతినిధుల పేర్లు, అధికారుల పేర్లు చెబుతూ అందరినీ అబ్బు రపరిచారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఉపమేయర్ రాజేష్‌రెడ్డి, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి రబ్బానీ, ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు చల్లాబాబు, ఏఎస్ మనో హర్, గాంధీ, శ్రీనివాసులు, చంద్రప్రకాష్, తదిత రులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్

## పిడుగుపాటు బాధితురాలికి రూ.12 లక్షల ఎక్స్‌గ్రేషియా

చిత్తూరు లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):పిడు గుపాటుతో కుటుంబ సభ్యులను కోల్పోయిన మహిళకు ఏపీ లోకాయుక్త రూ.12 లక్షలను ఎక్స్ గ్రేషియా రూపంలో అందించింది.పెద్దపంజాణి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన ఎం. వరలక్ష్మి భర్త ఎం. రామకృష్ణఇద్దరు కుమార్తెలు పిడుగుపా టుకు గురై మరణించారు.అయితే రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన విధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) కింద ఎక్స్‌గ్రే షియా సహాయం అందలేదని వరలక్ష్మి లోకా యుక్త, ఉపలోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన లోకాయుక్త ఎఫ్ ఏసీ పి. రజని ఎక్స్‌గ్రేషియా చెల్లింపునకు సత్వర చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారు లైన డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్‌కు, రెవిన్యూ శాఖ ఎక్స్ అఫిషియో డిప్యూటీ సెక్రటరీకి ఆదే శాలు జారీచేశారు. దీని ఫలితంగా రూ.12లక్షల ఎక్స్‌గ్రేషియాను వరలక్ష్మికి ప్రభుత్వం చెల్లించింది.

# తెలుగు భాషా పరిరక్షణకు కృషిచేద్దాం..!

**● తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు**

గంగవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాధి ఉగాది పర్వదినాన తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృ తిక సమితి, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ముందస్తు ఉగాది పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో అన్ని యాజ మాన్య పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని తప్పనిసరి చేసి, ఆంగ్లభాషను మంచి నైపుణ్యం కలిగిన వారిచే బోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యో గాలలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. నామ ఫలకాలు సైతం తెలుగులో లేకపోతే అలాంటి ప్రభుత్వ ప్రైవేటు కార్యా లయాలకు జరిమానాలు విధించాలన్నారు.




ఉగాది పురస్కారాలను అందుకున్న ప్రముఖులు

అనంతరం పలు రంగాల్లో సేవలందిస్తున్న పలమనేరు బాలాజీకి గీతాంజలి స్మారక పుర స్కారాన్ని అందించారు. అలాగే ఎస్‌బీ సీఐ భాస్కర్, డాక్టర్లు రాజారెడ్డి, వాసు, సుశీల , కిరణ్‌కుమార్, గురుమూర్తి, బాలాజీ, చంద్రశే ఖర్, సరిత, నరసింహులు నాయుడు, రెడ్డెప్ప నాయుడు, శక్తిప్రసాద్‌లకు విశ్వవసునామ ఉగాది పురస్కారాలను అందించి పూలమాల లతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, శ్రీరామచంద్రమూర్తి, పద్మశ్రీ శ్రీనాథ్, యుగంధర్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

**● మంత్రి రాంప్రసాద్ రెడ్డి**

చిత్తూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ మెంబర్ షిప్ కార్డులను అందజే యాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని చెప్పారు. ఇందుకోసం కుటుంబ సారథులను నియమించుకుని, ప్రజల సమ స్యలు తెలుసుకోవాలన్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృ తంగా తీసుకెళ్లాలని సూచించారు. ఏప్రిల్ నుంచి గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయి సంస్థాగత ఎన్నికలు నిర్వహించి, కమిటీలు ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర అధికారప్రతినిధి సురేంద్రకుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, నేతలు మోహన్‌రాజ్, ఇందిరమ్మ, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఖాళీ స్థలాలను ఆదాయ వనరుగా మార్చాలి

**మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**

చిత్తూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ స్థలాలను ఆదాయ వనరుగా మార్చాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్ర సాద్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు పర్యటనలో భాగంగా ఆర్టీసీ వన్ డిపోను చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ చిత్తూరు వన్ డిపో వద్ద ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఆర్టీసీకి ఆదాయం వస్తుందన్నారు. అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్టీసీకి సంబంధించిన వినతులను స్వీకరించారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కమిషనర్ నరసింహ ప్రసాద్, టీడీపీ నాయకులు చల్లాబాబు, ఏఎస్ మనోహర్, కాజూరు బాలాజీ, కార్పొరే టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.34 కోట్లు

ఐరాల(కాణిపాకం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వర సిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,34,52,997 లభిం చింది. ఆలయ ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో ఆస్థాన మండపంలో శుక్ర వారం హుండీలను సిబ్బంది లెక్కించారు. 31 గ్రాముల బంగారుతోపాటు 2కిలోల 420 గ్రాముల వెండి లభించింది. అలాగే 620 యూఎస్‌ఏ, 20 ఆస్ట్రే లియా, 50 కెనడా, 11 సింగపూర్ డాలర్లు, 10 ఇంగ్లాండ్ పౌండ్లు, 4 మలే సియా రింగిట్స్, యూరో ఒకటి లభించినట్లు ఈవో తెలియజేశారు. వీటితో పాటు గో సంరక్షణ హుండీ ద్వారా రూ.7,300, నిత్యాన్నదానం కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన హుండీద్వారా రూ.40,404 సమాకూరినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవ రెడ్డి, ప్రసాద్, ధనంజయ, సీఎఫ్‌వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి కొత్తగా 1840 అంగన్వాడీ కేంద్రాలు

**ఎంపీ ప్రసాదరావు విజ్ఞప్తితో మంజూరు చేసిన కేంద్రప్రభుత్వం**

చిత్తూరు (గాంధీ సర్కిల్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కొత్తగా అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసా దరావు విజ్ఞప్తి చేయగా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. 1840 కేంద్రాలను మంజూరు చేసింది. పార్లమెంటు సమావేశాల్లో భాగంగా శుక్ర వారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ అంగన్వాడీ సమస్యలపై చర్చించారు. దేశవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల అప్‌గ్రెడేషన్ సగటు 6.5 శాతం ఉందని చెప్పారు. ఈ విధంగా పరిశీలిస్తే ఏపీ 5 శాతంతో వెనుకబడి ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి స్పందిస్తూ.. గతంలో ఏపీకి 864 అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేశామన్నారు. మిషన్ పోషణ్ ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధి పథకం కింద నిర్మాణాలు జరుగుతున్నాయ న్నారు. కాగా, తన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని నూతన కేంద్రాలను మంజూరు చేయడంతోపాటు నిర్మాణాలకు రూ.30కోట్లు విడుదల చేయడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు.

# ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపండి

**డీఎఫ్‌వోకు బాధిత రైతుల వినతి**

యాదమరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడుల నుంచి తమకు శాశ్వత పరి ష్కారం చూపాలని డీఎఫ్‌వో భరణిని టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ యాదవ్ ఆధ్వ ర్యంలో బాధిత రైతులు కోరారు. దళవాయి పల్లె, మాదిరెడ్డిపల్లె, తాళ్లమడుగు గ్రామాలకు చెందిన వందమంది రైతులు శుక్రవారం డీఎ ఫవోకు వినతి పత్రం అందజేశారు. ఏనుగుల దాడులతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నా మని చెప్పారు.

**సోలార్ కంచె ఏర్పాటుకు చర్యలు**

కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి ఈవిషయాన్ని తీసుకెళ్లి, అందుబాటులో ఉన్న నిధులతో ఐదు కిలోమీటర్ల మేర సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో చెప్పినట్లు రైతులు తెలిపారు. ఏను గుల సంచారం ఉండ టంతో అటవీ సమీప గ్రామాల రైతులు రాత్రి పూట అప్రమత్తంగా ఉండాలని భరణి హెచ్చరించారు. ఏనుగుల గుంపు పొలాలవైపు రాకుండా సాయంత్రం పూట పొలాల్లో రైతులకు మిరప, చెత్త ఉపయోగించి పొగ పెట్టే విధానంపై తమ సిబ్బందితో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐఎఫ్ఎస్ సంకేత్ సునీల్ గరుడ్, ఎఫ్ఎస్‌వో మోహన మురళి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో భరణి

## సీనియారిటీ జాబితాలో తప్పులు సవరించండి : ఎస్టీయూ

చిత్తూరు సెంట్రల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్ల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలో తప్పులు సవరించాలని ఎస్టీయూ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, రాష్ట్ర కార్యదర్శి హేమారెడ్డి తదితరులు శుక్ర వారం డీఈవో వరలక్ష్మిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తమకు అందుబాటులో ఉన్న రికార్డుల మేరకు జాబితాను ప్రాథ మికంగా విడుదల చేశామని తెలిపారు. టీచర్ల అప్పీళ్లన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తుది సీనియారిటీ జాబితా విడుదల చేస్తామని చెప్పారు. టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేద న్నారు. డీఈవోకు వినతి పత్రం అందించిన వారిలో ఎస్టీయూ నాయకులు రామచంద్రారెడ్డి, మునప్ప, దేవరాజులురెడ్డి, మునికృ ష్ణనాయుడు, మోహన్, తదితరులు ఉన్నారు.

## ఏడు మండలాల్లో వడగాడ్పులు



ఎండల ధాటికి నిర్మానుష్యంగా చిత్తూరు గాంధీసర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ఎండలతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. శుక్రవారం ఏడు మండలాల్లో వడగాడ్పులు వీచాయి. అత్యధికంగా నగరి, తవణంపల్లె మండలాల్లో 41.1డిగ్రీల ఉష్ణో గ్రతలు నమోదయ్యాయి. గంగవరంలో 40.9డిగ్రీలు, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 40.8, శ్రీరంగరాజపురంలో 40.6, నిండ్రలో 40.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అలాగే పలమనే రులో 39.8, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 39.2, బంగారు పాళ్యం, గంగాధరనెల్లూరు మండలాల్లో 38.9, చౌడేపల్లె, పాలసముద్రం, పెనుమూరు, పూతలపట్టు, వెదురుకుప్పం, విజయపురం మండలాల్లో 38.7, యాదమరిలో 38.3, సదుంలో 38.1, గుడుపల్లె, శాంతిపురం, సోమల, వి.కోట మండలాల్లో 37.9, కార్వేటినగరంలో 37.4, పెద్దపంజాణిలో 37.3, బైరెడ్డిపల్లెలో 36.8, పుంగనూరులో 35.8, కుప్పం, రామకుప్పంలో 35.5 డిగ్రీల ఉష్ణోగ్ర తలు నమోదయ్యాయి.

## జై జగన్ అంటే కేసులు పెడతారా?

**● చంద్రగిరి వైసీపీ ఇన్‌చార్జి విమర్శ**

తిరుపతిరూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్ ఎంపీపీగా తమ అభ్యర్థి గెలవడంతో జైజగన్ అంటే కేసులు పెడతారా అంటూ చంద్రగిరి వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విమర్శించారు. తుమ్మలగుంటలోని స్వగృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు ఖాకీ చొక్కా వేసుకుని రాజకీయాలు చేస్తున్నారని, ఎవరినో తృప్తి పరిచేందుకు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తమ అభ్యర్థి గెలవ డంతో టపాకాయలు కాల్చి, నినాదాలు చేస్తే.. శాంతిభద్రతలకు విఘాతం కలి గించారని కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికి తనపై నాలుగు కేసులు నమోదు చేశారని, మరో 40 పెట్టినా భయపడేది లేదన్నారు. తప్పుడు కేసులు కొనసాగిస్తే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తా మని, జిల్లా పర్యటనకు వచ్చే సీఎం, మంత్రులకు నిరసన తెలుపుతామ న్నారు. రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, నేతలు దామినేటి కేశవులు, నరేష్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, కోటేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు అతిక్రమించినందుకే కేసులు

**● చంద్రగిరి డీఎస్పీ స్పష్టీకరణ**

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించినందుకే వైసీపీ నేతలపై కేసులు నమోదు చేశాం. అయితే, పోలీసులు టీడీపీ తరఫున పనిచేస్తున్నారని వారు నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదు' అని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు ఏ పార్టీకి కొమ్ము కాయరని, ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. 'చట్టాన్ని అతిక్రమించి పోలీసులు ఎలాంటి కేసులు పెట్టరు. అందరూ చట్టానికి లోబడి పని చేస్తారన్న విషయాన్ని వారు గమనించాలి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నపుడు నలుగురికి మించి వ్యక్తులు రోడ్లపై గుంపులుగా ఉండరాదు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత సంబ రాలు చేసుకోరాదు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని నిబంధన లున్నాయి. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపై బాణసంచా కాల్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో వారిపై కసులు నమోదు చేశాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జై జగన్ అనే నినాదంపై కేసులు నమోదు చేయ లేదని డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపైనే కేసులు నమోదు చేస్తామన్నారు. దీనిని వక్రీకరించి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోలీసులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

## టెన్త్ పరీక్షల్లో ఓ విద్యార్థి డీబార్

చిత్తూరు సెంట్రల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ పరీక్షల్లో వి.కోట మండలం జడ్పీ ఉన్నత (బాలుర) పాఠశాల ఏ సెంటర్‌లో కాపీయింగ్‌కు పాల్పడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డ విద్యార్థిని డీబార్ చేసినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. 21143 మంది విద్యార్థులకు 20895 మంది హాజర వగా, 248 మంది గైర్హాజరయ్యారు. డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిష నర్ వెంకటేశ్వరరావులు రెండు కేంద్రాలు, 15 ఫ్లయింగ్ స్క్వాడ్లు 19 కేంద్రాలు తనిఖీ చేశాయి. 47 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు విధులు నిర్వహించినట్లు డీఈవో వివరించారు.

## బాలిక కిడ్నాప్ కేసులో జీవిత ఖైదు

చిత్తూరు లీగల్, మార్చి28(ఆంధ్రజ్యోతి):బాలి కను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడికి చిత్తూరు పోక్సో కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పుచెప్పింది. గుడిపాల మండలం చిత్తపార గ్రామానికి చెందిన దినేష్ కుమార్ అలియాస్ దినేష్ 2022 జనవరి 31వ తేదీన చిత్తూరుకు చెందిన ఓ బాలికకు మాయమా టలు చెప్పి, కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. మరుసటి రోజు తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకెళ్ళి వివాహం చేసుకు న్నాడు. కాగా బాలిక తల్లి తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ పద్మావతి కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. తిరుపతిలో ఆ బాలికను గుర్తించి విచారించగా అసలు విషయం బయటపడింది.దీంతో దినేష్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించారు. ఈ కేసు శుక్రవారం పోక్సో కోర్టులో వాయిదాకు రాగా పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శాంతి నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి వాదించారు.



నిందితుడు దినేష్

## ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ


ఉగాది క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం త్రైత సిద్ధాంతం వారి విశ్వావసు నామ సంవత్సర త్రైత శకం 47వ సంవత్సరపు ఉగాది నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పలమనేరు కమిటీ అధ్యక్షులు సీఆర్ బాస్కర్, సభ్యులు జ్యోతి, హేమంత్‌కుమార్, రెడ్డెమ్మ, రేఖ, కళ్యాణిలతో పాటు టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం గౌడు పాల్గొన్నారు. అలాగే ఇందూ జ్ఞానవేదిక సభ్యులు పలమనేరు సీఐ నరసింహులు, ఎస్.ఐ స్వర్ణతేజ, తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డిల చేతుల మీదుగా ఉగాది క్యాలెండర్లు ఆవిష్కరించారు.

## తాగునీటి ట్యాంకుల పరిశీలన


తాగునీటి సంపులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ని సరఫరా చేయడానికి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. మున్సిపాలిటీలోని ఎద్దులసంత వీధిలోని నీటి పంపుహౌస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు, లక్ష్మీనగర్ కాలనీలో ఓఎల్‌ఎల్ పాఠశాల ముందు ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. పైప్ లీకేజీలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సురేష్‌బాబు, ఏఈ ఆర్.స్నేహప్రియ, అసిస్టెంట్ ఇంజనీర్, వార్డు కార్యదర్శులు, పంపు ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఏకగ్రీవం



పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కల్లూరు పంచాయతీ కార్యదర్శి జి. నాగరాజు, సంఘం అధ్యక్షుడిగా మంగళంపేట కార్యదర్శి ఎం. నాగరాజు, ఉపాధ్యక్షులుగా రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా కళ్యాణి, కమిటీ సభ్యులుగా శ్రీబాబు, నాగరాజు, రామకృష్ణయ్య, దినేష్, రవిచంద్ర, సుధాకర్, సురేష్, బాలాజీ, గణేష్, వెంకట్రమణ, మురళి, రేణుక, సూర్య, సంతోష్, శివశంకర్‌రెడ్డి, బాలకృష్ణ ఎంపికయ్యారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

## విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శుక్రవారం విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్టుమీటర్ల ఏర్పాటు నిలిపివేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గిరిధర గుప్తా, ఈశ్వర్, రాజా, శ్రీరామయ్య, లక్ష్మయ్య, రత్నమ్మ, ఖైరున్నీసా, సరోజమ్మ, బాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్

పుంగనూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేద హిందూ, ముస్లిం కుటుంబాలకు ప్రగతి దాత సేవా సంస్థ అధ్యక్షులు సుకుమార్ (విశ్రాంత డీఎస్పీ) శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక హైస్కూల్ వీధిలోని ఆయన స్వగృహంలో అందించారు. పేదలకు సాయం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరారు. విశ్రాంత హెచ్‌ఎం, భరత్‌భూషన్, అద్దాల నాగరాజు, శ్రీనివాసులు, రవికుమార్, సుబ్బన్న, రెడ్డెప్ప, సులోచన పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి


మంత్రిని కలిసిన చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం రాయచోటి నుంచి చిత్తూరుకు వెళుతున్న మంత్రిని పీలేరు సమీపంలో కలిశారు. నియోజకవర్గం అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. రొంపిచెర్ల మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు మదనమోహన్‌రెడ్డి, మురళీనాయుడు, సుధాకరనాయుడు, ధనంజయనాయుడు, మహేష్, రమేష్, అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

## కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి


సులోచన, వెంకట్రామగౌడులను సత్కరిస్తున్న పీఎస్ఎం

రామకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆశయాలకనుగుణంగా కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్ మునిరత్నం కోరారు. గురువారం రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీలుగా ఎన్నికైన సులోచన, వెంకట్రామగౌడులను ఆయన శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలన్న తలంపుతోనే సులోచనమ్మ, వెంకట్రామగౌడు అభ్యర్థిత్వాలను ప్రకటించామన్నారు. వారు ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, తిరుపతి గంగమ్మ గుడి మాజీ చైర్మన్ రవిచంద్రబాబు, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, నేతలు శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, కృష్ణారెడ్డి, శంకర్‌చలం, రామలింగం పాల్గొన్నారు.

## దివ్యాంగ పిల్లలకు సహాయ ఉపకరణాల పంపిణీ


సహాయ ఉపకరణాలు అందజేస్తున్న విద్యాశాఖాధికారులు

పుంగనూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలకు సహాయ ఉపకరణాలను ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో అందించారు. ప్రభుత్వం పుంగనూరుకు 6 వినికిడి పరికరాలు, 3 వీల్ ఛైర్స్, ట్రైసైకిల్ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. పిల్లలకు గుణాత్మక విద్యతో పాటు వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అరుణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## బోయకొండ గంగమ్మకు రాహుకాల పూజలు



చౌడేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులకు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## కౌలుకు ఆలయ భూముల వేలంతో రూ.37,400 ఆదాయం

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయానికి సంబంధించిన 7.56 ఎకరాల భూములకు శుక్రవారం మూడేళ్ల కాలానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం ఓ ఆలయానికి రూ.37,400 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో యువరాణి తెలిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఫణియాజశయన, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## 5 నుంచి పుంగనూరు సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్ 5 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 5న అంకురార్పణ, 6న ధ్వజారోహణ, సింహ వాహనోత్సవం, 7న యాళి వాహనోత్సవం, 8న శేషవాహనోత్సవం, 9న రావణ వాహనోత్సవం, 10న నంది వాహనోత్సవం, 11న కల్యాణోత్సవం, గజవాహనోత్సవం, 12 రథోత్సవం, 13న అశ్వ వాహనోత్సవం, 14న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 15న రుద్రాభిషేకం, అన్నలింగార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## జీవశాస్త్రం పరీక్షకు 1,375 మంది విద్యార్థుల హాజరు

పలమనేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జీవశాస్త్ర పరీక్షకు 1,375 మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరంల తెలిపారు. మండలంలోని 7 సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా ఇద్దరు మాత్రమే గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

## సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపు కేంద్రాలు

పలమనేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30, 31వ తేదీల్లోనూ పలమనేరు మున్సిపాలిటీలోని పన్ను చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు. ఈనెలాఖరు వరకు ఆస్తిపన్ను అపరాధ రుసుంలో 50 శాతం ప్రభుత్వం రాయితీ ఇచ్చిందని.. ఈ అవకాశాన్ని బకాయి ఉన్న ఆస్తిపన్ను చెల్లింపు దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్ను బకాయిదారులు వెంటనే బకాయిలు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుం కుమ అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ అభిషేకాలు చేపట్టారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో సతామీరాత్

రొంపిచెర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రం జాన్ మాసంలోని సతామీరాత్ (పెద్దపండుగ) గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు భక్తిశ్రద్ధలతో ముస్లింలు నిర్వహించారు. రొంపిచెర్ల పట్టణంలో ముస్లింలు అత్యధికంగా ఉన్నందున రాత్రంగా సందడి నెలకొంది. అనంతరం ముస్లింల ఇళ్లల్లో పూర్వీకుల పేరుతో చదివింపులు (ఫాతెహా) చేసి పేదలకు అన్నదానం చేపట్టారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేశారు.

## ఎట్టకేలకు శుద్ధినీటి సరఫరా

సోమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయం వద్ద నీటి శుద్ధి కేంద్రంలో శుక్రవారం నుంచి ప్రజలకు పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తున్నారు. గత కొన్నినెలలుగా కేంద్రంలోని పరికరాలు మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'శుద్ధి నీటికి మోక్షం కలిగేనా!' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు నీటి శుద్ధి కేంద్రంలోని పరికరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. శుద్ధ జలం పంపిణీ చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైతులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

సోమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతు గుర్తింపు కార్డు కోసం ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతు గుర్తింపు కార్డు లేకుంటే పీఎం కిసాన్, ఇతర ప్రభుత్వ పథకాలు పొందలేరని తెలిపారు.

## ఉద్యోగ విరమణ సన్మానం

ఐరాల(కాణిపాకం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఐరాల ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కుసుమకుమారిని ఎమ్మెల్యే మురళీమోహన్ సన్మానించారు. కాణిపాకంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆమె భర్త గుడిపాల ఎంపీడీవో శివరాజు కూడా ఉద్యోగ విరమణ చేశారు. దీంతో వీరిద్దరినీ సత్కరించారు. ఐరాల మాజీ ఎంపీపీ శాంతమ్మ, మాజీ జడ్పీటీసీ లత తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుపై నిరసన


కల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు


రొంపిచెర్ల చిన్నమసీదులో ముస్లింల నిరసన



పుంగనూరులో ఎస్‌డీపీఐ నాయకులు

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ముస్లిం మత పెద్దలు మస్తాన్ వల్లి, ఇజాజ్ అహ్మద్, అలీం, రాయచోటి షౌకత్, సలీం, షకూర్, సాజిద్ తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలోని పెద్ద మసీదు వద్ద ముస్లిం సోదరులు చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టంతో ముస్లింలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపుతోందని, ఈ చట్టాన్ని ఉపసంహరించకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షౌకత్, మునీర్‌ఖాన్ అబ్బాస్, ఇమ్రాన్, అన్సర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లులకు వ్యతిరేకంగా శుక్రవారం రొంపిచెర్ల చిన్నమసీదులో ముస్లిం మైనారిటీ సమాఖ్య ఆధ్వర్యంలో నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.

● పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వక్ఫ్‌బోర్డు బిల్లు ప్రవేశపెట్టడం సరికాదని ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మసీదుల ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ జిల్లా కార్యదర్శి యూసుఫ్, అతిక్‌బాషా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కంపోస్టుయార్డులో మంటలు

● దుర్వాసనతో అవస్థలు పడుతున్న వాహనదారులు

● పట్టించుకోని అధికారులు


కంపోస్టు యార్డులో చెలరేగుతున్న మంటలు

గంగవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల కేంద్రంలో రోడ్డుపక్కనే ఉన్న కంపోస్టు యార్డుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. రెండు రోజుల నుంచి యార్డులో మంటలు చెలరేగుతున్నా సంబంధిత మండల, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆ దారిన వెళ్లే వాహనదారులు దుర్వాసనను భరించలేక అవస్థలు పడుతున్నారు. గంగవరం పరిసర ప్రాంతాల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని గంగవరం గ్రామ సమీపంలోని సిగరాకు చెరువు వద్ద చెత్తను డంపింగ్ చేస్తుంటారు. దీంతోపాటు ఆసుపత్రి వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలను సైతం ఈ యార్డులోనే వేసేస్తుంటారు. అయితే గత కొద్దినెలలుగా అక్కడ ఉన్న చెత్తను సంపద కేంద్రాలకు తరలించకపోవడంతో చెత్త నిల్వలు విపరీతంగా పేరుకుపోయాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి కంపోస్టు యార్డుకు నిప్పంటించారు. గత రెండు రోజుల నుంచి మంటలు వ్యాపించి పొగలు చిమ్ముతూ దుర్వాసన వెదజల్లుతోంది. పొగతో పాటు దుర్వాసనతో వాహనదారులు భరించలేక పోతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ సిగరాకు చెరువులో రెండు రోజుల నుంచి మంటలు, పొగలు వ్యాపిస్తున్నా సంబంధిత అధికారుల కళ్లకు కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంటలను అదుపుచేసి దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసులు

సదుం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని పీడీ రవికుమార్ సూచించారు. శుక్రవారం సదుంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో రూ.11,93,72,698 పనులు జరిగాయన్నారు. ఇందులో రూ. 36,380 రికవరీ గాను రూ.36 వేలు రికవరీ చేసినట్లు తెలిపారు. తనిఖీ ప్రజావేదికలో డీఆర్వో శివయ్య, ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మహాభారత ఉత్సవాలు



కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అర్జున తపస్మాన్ ఘట్టం కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ద్రౌపది సమేత ధర్మరాజుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని తపస్మాన్ వద్దకు అర్జునుడి వేషధారి చేరుకున్నాడు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విసిరిన నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## తాళ్లపల్లె ఉప సర్పంచ్‌గా భారతి ఏకగ్రీవం



ఎం.భారతి

గంగవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాళ్లపల్లె ఉప సర్పంచ్ ఎన్నికల్లో ఎం.భారతి ఏకగ్రీవంగా ఎన్నికైంది. గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్న బి.భారతి వ్యక్తిగత కారణాలతో ఆరు నెలల క్రితం పదవికి రాజీనామా చేయడంతో ఉపసర్పంచ్ స్థానానికి ఖాళీ ఏర్పడింది. దీంతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించగా.. నలుగురు వార్డు మెంబర్లు మాత్రమే హాజరవడంతో కోరం లేదని అధికారులు శుక్రవారానికి వాయిదా వేశారు. శుక్రవారం 10 మంది వార్డు సభ్యులకు గాను 7 మంది హాజరై తమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం.భారతిని ఉపసర్పంచ్‌గా ప్రతిపాదించారు. ఎం.భారతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి దేదీప్య ప్రకటించి ధ్రువపత్రం అందించారు. టీడీపి మద్దతుదారు ఎం.భారతి ఎన్నిక కావడంతో ఆ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, సురేష్‌నాయుడులతోపాటు పలువురు నాయకులు, పలువురు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## వసతి గృహాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ల వితరణ


వసతి గృహానికి ఆర్వో ప్లాంట్ వితరణ చేస్తున్న సాగర్‌రాజ్ తదితరులు

కుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఇంజనీరింగ్ కళాశాల సీఈవో ఎస్.సాగర్ రాజ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని కుప్పంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, ప్రభుత్వ బాలికల వసతి గృహాలకు ఆర్వో వాటర్ ప్లాంట్లను సాగర్ రాజ్ వితరణ చేశారు. అలాగే కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కుప్పం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు 30 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో రక్తదానం జరిగింది. కార్యక్రమాల్లో బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, కేఈసీ వైస్ ప్రిన్సిపాల్ ఎస్. భాస్కరన్, కేడీసీ ప్రిన్సిపాల్ సుధారాణి, కుప్పం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విమల్ జోసెఫ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సీనియర్ నేత వసంత్ కుమార్‌కు చిత్తూరులో శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్, చల్లా రామచంద్రారెడ్డి తదితరులు

## మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

సోమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సోమల ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రయాణాల్లో హెల్మెట్ ధరించకపోవడంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు.

## 12 ట్రాక్టర్లతో సహా ఎక్స్‌కవేటర్ స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

గంగవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మట్టి మాఫియాపై గురువారం రాత్రి పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి 12 ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలంలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇష్టానుసారం మట్టిని రవాణా చేస్తున్నారని ఆ ప్రాంత వాసులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీంతో గురువారం రాత్రి పోలీసులు మేలుమాయి, ముబ్బుబాళ్లపేట చెరువుల వద్ద తనిఖీలు చేయగా మట్టిని లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు సీఐ తెలిపారు.

## ఆటో ఢీకొని వృద్ధుడి మృతి


మృతుడు కృష్ణమూర్తి

సదుం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సదుంలో జరిగింది. ఎస్‌ఐ షేక్ షావలి కథనం మేరకు.. మండల పరిధిలోని అమ్మగారిపల్లె నివాసి కృష్ణమూర్తి(82) సిమెంట్ బ్రిక్స్ తయారీ స్థలానికి వెళుతుండగా సదుం వైపుగా వస్తున్న లగేజీ ఆటో ప్రమాదవశాత్తు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కందూరులో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు

సోమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులోని మూడు మసీదుల్లో ముస్లింలకు టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం రంజాన్ పండుగను పురస్కరించుకుని రాత్రి పలువురు ముస్లింలకు పలు రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, అష్రఫ్ అలీ, నౌషాద్, బాల, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఆరుగురు పోలీసుల బదిలీ

పుంగనూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పోలీసు స్టేషన్ నుంచి ఆరుగురు సిబ్బంది బదిలీ అయినట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లు బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు.

## పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన ఉండాలి


గ్రామస్తులకు సూచనలిస్తున్న జడ్జి మాధవి

బంగారుపాళ్యం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన ఉండాలని ఫస్ట్ ఏడీఎం కోర్టు జడ్జి మాధవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చిత్తూరు వారి ఆధ్వర్యంలో శుక్రవారం కరిడివారిపల్లె గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు ఉన్న పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు రోజు రోజుకూ ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. సీఐ కత్తి శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వేని తనిఖీ చేసిన డీపీవో


గరిగెలపల్లెలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో సుధాకర్‌రావు

గంగాధరనెల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాతవెంకటాపురం పంచాయతీ గరిగెలపల్లె గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని డీపీవో సుధాకర్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సర్వేతో గ్రామాల్లో భూమి హక్కులకు సంబంధించి వాస్తవవిషయాలు వెలుగులోకి వచ్చి స్పష్టమైన రికార్డులు రూపొందించవచ్చునని తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి వీలుంటుందని చెప్పారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పలువురు సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఫ్యాప్టో చైర్మన్‌కు అభినందన



సమావేశంలో ప్రసంగిస్తున్న మణిగండన్

నగరి/విజయపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో (ఫెడరేషన్ ఆఫ్ ఏపీ టీచర్స్ ఆర్గనైజేషన్) నూతన చైర్మన్‌గా ఎన్నికైన మణిగండన్‌ను మండల, నియోజకవర్గ స్థాయి యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నగరి, విజయపురంలో అభినందించారు. ఈయన విజయపురం మండలం పన్నూరు-2లో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. మారుమూల మండలం నుంచి ఈ స్థాయికి చేరుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. నగరి పీసీఎన్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మణిగండన్ మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని చెప్పారు. నాయకులు దీనావతి, మునిరత్నం, వంశీకృష్ణ, వెంకటేష్, రవీంద్రబాబు, బాలాజి, శ్రీనివాసులు, రూబన్, జనార్దన్, కుప్పరాజు, సురేష్ పాల్గొన్నారు.

## ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ


బాధితురాలికి కిట్ అందజేస్తున్న సుధారాణి, వేణుగోపాల్ తదితరులు

యాదమరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వారికి అవసరమైన మందుల కిట్లను వైద్య శాఖ అధికారులు పంపిణీ చేశారు. మండలంలోని పెరుమాళ్లపల్లెలో ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వేదాంబకు కిట్‌ను శుక్రవారం మధ్యాహ్నం డీఎంహెచ్‌వో సుధారాణి అందజేశారు. డీఎంవో వేణుగోపాల్, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శివసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. కాగా, యాదమరి పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ చేసిన నర్సు జయభారతిని డీఎంహెచ్‌వో సన్మానించారు.

## పాస్టర్ మృతిపై సంతాపం


కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలుపుతున్న క్రైస్తవులు

బంగారుపాళ్యం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఆల్ఫోన్స్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. ఫాదర్ ప్రభుకుమార్, పాస్టర్లు కిరణ్, యోహాన్, జయసింగ్, రూపస్, జకర్యా, జయకుమార్, యోమన్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నెంబరు 430లో నిర్మాణాలు చేపడితే చర్యలు

● తహసీల్దారు హెచ్చరిక

పెనుమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల కేంద్రంలో సర్వే నెంబరు 430లో ఎవ్వరూ ఎలాంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. ఈ సర్వే నెంబరుపై కోర్టులో కేసు ఉన్నా.. కొందరు పనులు చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆయన తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను ఆపించారు. ఇకపై పనులు చేసినవారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయమని వీఆర్‌వో, వీఆర్ఏలకు సూచించారు.

## ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు రూ.26వేల వేతనమివ్వాలి: సీఐటీయూ

బంగారుపాళ్యం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వాడ గంగారాజు, ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కెట్ యార్డులో జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఉద్యోగభద్రత కల్పించి, నెల నెలా జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 22 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి భారతి, కోశాధికారి హనుమంతు, జిల్లా కార్యదర్శి శంకరన్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదమని తెలిసినా..

వెదురుకుప్పం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రమాదమని తెలిసినా కొందరు బైకుల్లో ఇద్దరుకు మించి ప్రయాణం చేస్తున్నారు. శుక్రవారం కార్వేటినగరంలో ఓ బైక్‌లో ఐదుగురు ప్రయాణిస్తూ కనిపించారు.

## చిన్న మసీదులో ప్రార్థనలు

చిత్తూరు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఆఖరి శుక్రవార ప్రార్థనలను బజారు వీధిలోని చిన్నమసీదులో శుక్రవారం ముస్లింలు చేశారు. హైరోడ్ శేషాపిరాన్, మిట్టూరు జామియా మసీదుల్లో సాయంత్రం ఇఫ్తార్ విందును ఆయా కమిటీలు ఏర్పాటు చేశాయి.

## వరసిద్ధుడి సేవలో ప్రభుత్వ విప్

ఐరాల(కాణిపాకం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యుడు చిరంజీవి కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చిత్తూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిని ఎదుర్కోవడానికి విద్యుత్ శాఖ చర్యలు మొదలుపెట్టింది. శుక్రవారం సంతపేటలో ధర్మరాజులు గుడి వద్ద నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను టౌన్ డీఈ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నగరంలో అధిక లోడ్ నమోదవుతున్న 14 ప్రాంతాలను గుర్తించామన్నారు.




## హమ్మయ్య.. బతికిపోయా..!

నగరంలోని వైశ్య వీధిలో శుక్రవారం ఓ గోవు లోతైన కాలువలో పడిపోయింది. బయటకు రాలేక తల్లడిల్లి పోయింది. గమనించిన స్థానిక యువత, పెద్దలు అక్కడకు చేరుకున్నారు. ఓ తాడు సాయంతో దాన్ని బయటకు తీశారు. దీంతో ఆ గోమాత బతుకు జీవుడా అంటూ పరుగులు తీసింది.

- చిత్తూరు (గాంధీ సర్కిల్), ఆంధ్రజ్యోతి

# ప్రతి మహిళ.. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

చిత్తూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఎస్పీ విజయశేఖర్ కోరారు. శుక్రవారం ఎస్వీ సావిత్రమ్మ డిగ్రీ, సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా అత్యవసర సమయాల్లో మహిళలకు తక్షణ సాయం అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. మహిళా ఎస్ఐ నాగసౌజన్య, కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

## వేలంతో రూ.3.88 లక్షల ఆదాయం

వెదురుకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్, జంతువధశాల వేలంపాట ద్వారా కార్వేటినగరం గ్రామ పంచాయతీకి రూ.3.88 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో నాగరత్నమ్మ శుక్రవారం తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలంలో వారపు సంత ద్వారా రూ.2.94 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్‌కు రూ.32వేలు, బస్టాండ్‌కు రూ.31500, జంతు వధశాలకు రూ.30500 వచ్చిందన్నారు.

## ఉద్యోగ విరమణ సన్మానం


కుసుమకుమారి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఐరాల ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కుసుమకుమారిని ఎమ్మెల్యే మురళీమోహన్ సన్మానించారు. కాణిపాకంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఆమె భర్త గుడిపాల ఎంపీడీవో శివరాజు కూడా ఉద్యోగ విరమణ చేశారు. దీంతో వీరిద్దరినీ సత్కరించారు. ఐరాల మాజీ ఎంపీపీ శాంతమ్మ, మాజీ జడ్పీటీసీ లత తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగులను రక్షించడానికి ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంపు


ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు

బంగారుపాళ్యం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబపాళ్యం, తుంబకుప్పం, నల్లంగాడు, శెట్టేరి ప్రాంతాల్లో 25 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. అటవీ సమీప వ్యవసాయ పొలాల వద్ద ఎత్తు తక్కువ ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో తరచూ ఏనుగులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. వీటిని రక్షించడానికి విద్యుత్ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నారు. పనులను ఎస్ఈతోపాటు ఈఈ మునిచంద్ర, ఏడీ కొండయ్య, ఏఈ హేమచంద్ర పర్యవేక్షించారు.

## వేము కళాశాలలో రీడర్స్ క్లబ్


విద్యార్థినికి పుస్తకం అందజేస్తున్న చంద్రశేఖర నాయుడు

పూతలపట్టు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేస్తే జ్ఞానంతోపాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వేము ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణంలో రీడర్స్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్, వాట్సాప్‌లకే అంకితం కాకుండా పుస్తక పఠనానికి అలవాటు పడితే ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. ప్రొఫెసర్ అండ్ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధికారి ఎన్.గురునాథ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కాలేజీ బస్సును ఢీకొన్న బైక్

● ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ వెంకటరమణ

వెదురుకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాలేజీ బస్సును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం నుంచి ఓ కాలేజీ బస్సు పచ్చికాపల్లం వైపు వస్తోంది. సొడేపల్లెకు చెందిన వెంకటరమణ(25) బైక్‌పై స్వగ్రామం నుంచి పచ్చికాపల్లం వైపు వస్తున్నాడు. కాలేజీ బస్సు పచ్చికాపల్లం పీహెచ్‌సీ సమీపంలో ఆగి ఉండగా, వెనుక వైపు నుంచి బైక్‌తో వెంకటరమణ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లడానికి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇస్తే గంటకుపైగా ఆలస్యంగా వచ్చిందని బాధితుడి బంధువులు అసహనం వ్యక్తం చేశారు.

## సారా ఊట ధ్వంసం

పాలసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నరసింహాపురం గ్రామానికి చెందిన అర్జున్‌రెడ్డి గ్రామానికి సమీపంలోని భూతలకోన అటవీప్రాంతంలో సారా తయారు చేస్తుండగా శుక్రవారం ఎస్ఐ చిన్నరెడ్డెప్పకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి అర్జున్‌రెడ్డి పరారయ్యాడు. సంఘటన స్థలంలో పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల సారా ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరుగా యుగంధర్



వెదురుకుప్పం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరుగా కార్వేటినగరానికి చెందిన జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్నను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


జడ్పీ సీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న వినాయకం తదితరులు

చిత్తూరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడును ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. శుక్రవారం జడ్పీ చాంబర్‌లో సీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. కారుణ్య నియమకాలను చేపట్టాలని కోరారు. పీఎఫ్ లోన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్ ఆలస్యం కాకుండా మంజూరు చేయాలని విన్నవించారు. సంఘ నాయకులు రామ్మూర్తి, మహేష్, షణ్ముగం, అరుణ్‌కుమార్, దేవరాజులు, కుమార్, చలపతి పాల్గొన్నారు.

## నగరి కవికి సన్మానం



నగరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం ముడిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు పండితుడు దేశిరాజు చంద్రశేఖర్‌ను నెల్లూరు జిల్లాలో జరిగిన ఉగాది కవి సమ్మేళనంలో కనబరిచిన ప్రతిభకు సన్మానించారు. నెల్లూరుజిల్లా వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శతాధిక జాతీయ ఉగాది కవి సమ్మేళనంలో తన కవితాగానంతో అందరినీ మెప్పించడంతో ఆయనకు ఈ సన్మానం చేసినట్లు తెలిపారు. ఈయన్ను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, టీచర్లు అభినందించారు.

## నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

పాలసముద్రం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా టీడీపీ నేతలు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. శుక్రవారం పాలసముద్రంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులతో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు సమావేశమయ్యారు. అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. బలిజకండ్రిగలో శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ విప్ డాక్టర్‌థామస్ ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తారని తెలియజేశారు. నాయకులు శేఖర్‌రాజు, వాసునాయుడు, జె.విజయ్‌కుమార్, వెంకటేశులునాయుడు, అరుణ్‌నాథన్, వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**పూతలపట్టు:** మండలకేంద్రం నుంచి ఉదయం 9 గంటలకు ర్యాలీగా పాలకూరు వద్దకెళ్లి అక్కడున్న ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

# సంక్షిప్తంగా..

## సంత వేలం ఎప్పుడో?

యాదమరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చిన్నరెడ్డిపల్లె రోడ్డు వద్ద ప్రతి బుధవారం జరిగే సంతకు వేలం పాట నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో దాసరాపల్లె పంచాయతీ రాబడికి గండి పడుతోందని తెలిపారు. దీనిపై ఎంపీడీవో వేణును వివరణ కోరగా.. త్వరలో వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు.

## చట్టాలపై అవగాహన అవసరం

యాదమరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. శుక్రవారం కోణాపల్లె పంచాయతీ నల్లావూరు గ్రామంలో సివిల్ రైట్స్ సదస్సును ఎస్ఐ ఈశ్వర్, సిబ్బందితో కలిసి నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, దళిత సంఘం కమిటీ సభ్యుడు మురుగేషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరంగరాజపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను బంగారుపాళ్యం కమిటీ ఆధ్వర్యంలో 49.కొత్తపల్లెమిట్ట యూనియన్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు బాలాజి, రాంకుమార్, ప్రశాంత్, బాబు, సురేష్, శ్రీవత్సవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసామగ్రి పంపిణీ



వెదురుకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నచ్చుకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. తిరుపతికి చెందిన అంకురం స్వచ్ఛంద సంస్థ వితరణలో స్థానిక టీడీపీ నేత భాస్కర్ ద్వారా అందించారు.

## భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శనివారం మాస శివరాత్రి సందర్భంగా సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నేటినుంచిశక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం:** గిరింపేట గంగినేని చెరువు వద్ద ఉన్న శక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## 1నుంచి అగస్తీశ్వరుడి ఆలయ బ్రహ్మోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత అగస్తీశ్వర స్వామి ఆలయంలో ఏప్రిల్ ఒకటో తేదీనుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 6న సీతారాముల కల్యాణోత్సవం

వెదురుకుప్పం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఏప్రిల్ ఆరో తేదీన శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి టికెట్ పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లోనూ టికెట్లు బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## రోజా పరామర్శలు

విజయపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం మాజీ మంత్రి రోజా పలువురిని పరామర్శించారు. మహారాజపురంలో వైసీపీ నాయకుడు కార్తీక్ కుమార్తెను, విజయపురం హరిజనవాడ సర్పంచ్ జపమేరీ భర్త ప్రసన్నకుమార్‌ను, వైసీపీ నాయకుడు గుణశేఖర్‌ను పరామర్శించారు. అనంతరం కోసలనగరంలో వైస్ ఎంపీపీగా ఎన్నికైన కన్నెమ్మను అభినందించారు. వైసీపీ మండల అధ్యక్షుడు శివరాజు, నాయకులు రామకృష్ణమరాజు, గోవర్ధన్‌నాయుడు, గుణశేఖర్‌రెడ్డి, చెంచుప్రసాద్, బాబు, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వసంత్ కుమార్‌కు పలువురి శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత వి.వసంత్ కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులు నిర్వహించారు. పీవీకేఎన్ సమీపంలోని బీసీ భవన్ ఆవరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి సమక్షంలో వసంత్‌కుమార్ కేక్‌కట్‌చేసి పంచి పెట్టారు. ప్రధాన కూడళ్లలో అభిమానులు అన్నదానం చేశారు. ఎస్టేట్‌లోని ఆర్ఎల్ కల్యాణమండపం నుంచి గాంధీవిగ్రహం వరకు ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు కాజూరు రాజేష్, గురజాల సందీప్, కట్టమంచి కుమార్, చిట్టిబాబు, ఉదయ్‌కుమార్, ఎస్ఎస్ బాలాజి, మహేష్, ఆనంద్, కిరణ్, రాజు, శీనా, సుధాకర్ నాయుడు, మాన్యం కిషోర్ నాయుడు, తిరుకుమరన్ తదితరులు పాల్గొన్నారు.


వసంత్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు


అభిమానులు వేసిన గజమాలతో అభివాదం చేస్తున్న వసంత్‌కుమార్


వసంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న జీడీ నెల్లూరు టీడీపీ నేతలు దేవపత్ని ధనంజయనాయుడు, పైనేని మురళి నాయుడు, కిరణ్ నాయుడు, హరిచౌదరి, దీపక్ నాయుడు